
# మినీకథ



## ది గేమ్

వాణిశ్రీ

ఆ రోజు ఆదివారం. బోరగా వుంది క్లాస్ పుస్తకాలు చదివి చదివి. ఎక్కడైనా బయల్దేరదాం అనుకుంటూ వుండగా. ఆనంద్ వచ్చి "పోదాం పద" అన్నాడు.

"ఎక్కడికి?" ప్రశ్నించాను.

"వరప్రసాద్ ఇంటికి" అన్నాడు.

"ఎందుకు?" అని నేను ప్రశ్నించలేదు. ఏదో ఒక కాలక్షేపం. వరప్రసాద్ ఇంటికి కాదు. నరకానికైనా రెడీయే.

వరప్రసాద్ "వెల్ కమ్ ఫ్రెండ్స్" అన్నాడు.

కోటీశ్వరుల ఇళ్ళు ఎలా వుంటాయో సినిమాల్లోతప్పచూళ్ళేదు నేను వరప్రసాద్ ఇల్లు సినిమా సెట్టింగ్‌లా వుంది.

వరప్రసాద్ మాయూనివర్సిటీలో చదువుతున్నా నాకు అట్టేపరిచయంలేదు.ఆనంద్‌తో చాలా క్లోజ్. అందుకు కారణం లేకపోలేదు. ఆనంద్ స్పోర్ట్స్ ఛాంపియన్. అతనికి ప్రవేశం లేని ఆట లేదు.

వరప్రసాద్ లాన్‌లో గార్డెన్ ఛైర్స్ వేయించాడు. మధ్యలో టీపాయ్ వుంది. వాళ్ళనౌకరు టిఫిన్ ప్లేట్లు పర్దాడు. నేను మొహమాటపడుతుంటే ఆనంద్ కానివ్వమని తొందరచేశాడు. తర్వాత చెమటలు కక్కుతున్నకూల్‌డ్రింక్ బాటిల్స్‌వచ్చాయి.

ఇంతలో ఒక మెరుపు మెరిసింది.

ఆకాశంలో కాదు.

వరప్రసాద్ భవంతిలో.

దివి నుంచి భువికి దిగివస్తున్న అప్సరలా తెల్లటి దుస్తుల్లో మెరిసిపోతూవుంది ఆమె. ఆమె ముఖం ఆపిల్‌పండులా వుంది. మెడలో ముత్యాల హారం ఆమె అందం ముందు వెలవెలాపోతూ వుంది.

ఆమె చలాకీగా సెలయేరు దూకుతున్నట్లుగా. జింకపిల్ల గంతులేస్తున్నట్లు మా దగ్గరికి వచ్చింది.

"మీట్ మిస్ లావణ్య" పరిచయం చేశాడు వరప్రసాద్.

ఆమె వరప్రసాద్ మేనత్త కూతురు. హైదరాబాద్‌లో నివాసం. వాళ్ళ ఫాదర్‌కి ఇండస్ట్రీస్. హోటల్స్. సినిమా థియేటర్స్ వున్నాయి.

తర్వాత వరప్రసాద్ మమ్మల్ని వాళ్ళ స్పోర్ట్స్ షెడ్‌లోకి తీసుకెళ్ళాడు.

వరప్రసాద్, ఆనంద్ టేబుల్ టెన్నిస్ రెండు గేములు ఆడారు

ఆశ్చర్యం ఏమిటంటే రెండు గేముల్లోనూ ఆనంద్ చిత్తుగా ఓడిపోయాడు. నాకు విడ్డూర మనిపించింది. ఆనంద్ మూడో గేమ్‌లో ఎంతో పట్టుదలతో ఆడినట్లు నాకు తోచింది. అయినా ఈసారి కూడా వరప్రసాదే గెలిచాడు.

బావగారు గెలిచినందుకు లావణ్య సంతోషించింది. అతని చేతులు పట్టుకుని కంగ్రాట్స్ చెప్పింది. మేము లేకపోతే అతన్ని ముద్దు పెట్టుకుని వుండేదను కుంటాను.

తర్వాత ఆనంద్"పోదాంపద"అన్నాడు.

మేము గుడ్‌నైట్ చెప్పి బయల్దేరాం.

ఛాంపియన్ ఆనంద్. ఓడిపోవడం ఏమిటి? ఒకవేళ ఆనంద్‌కి వంట్లో బాగా లేదోమో? అని అనుమానం వచ్చింది.

"ఆనంద్?"

"వూ.."

"వంట్లో బాగాలేదా?"

"ఏం?"

"వరప్రసాద్ చేతిలో ఓడిపోతే అనుమానం వచ్చింది".ఆనంద్ పకపకనవ్వాడు.

"అదంతా నాటకం. దట్స్ ఏ గేమ్." అన్నాడు.

నేను నివ్వెరపోయాను.

ఆనంద్ నా భుజంమీద చెయ్యివేసి "అప్రనా! వాడి మరదకి స్పోర్ట్స్ అంటే ఇష్టమట. ఆమె మనసు దోచుకోడానికి తంటాలు పడుతున్నాడు. నన్ను ప్రతిమాలాడు. ఒక వారంపాటు రోజూ వాళ్ళింటికొచ్చిరెండు గేమ్స్ ఆడిపొమ్మని అందులో నేను ఓడిపోవాలి. అది ముఖ్యం. సరే అన్నాను పాపం వాడికోసం" అన్నాడు.

"నువ్వు ఛాంపియన్‌వి కదరా! వాడి చేతిలో ఓడిపోతే సిగ్గుగా వుండదూ?"

"సిగ్గెందుకురా. జీవితం ఒక నాటక రంగం అన్నాడు కవి. లైఫ్ ఈజ్ ఏ గేమ్ అని మనం అర్థం చేసుకోవాలి. అవసరం వచ్చినప్పుడు ఓడుతూ వుండాలి. గెలుస్తూ వుండాలి. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మల్లయుద్ధ యోధులుకూడా ఇటువంటి ఒప్పందాలు చేసుకుని లాభం పొందుతున్నారు.ఇక మనమెంత. ఆఫ్టరాల్. నేను ఓడినందుకు రెండువేలు అడ్వాన్స్ ఇచ్చాడు వరప్రసాద్. ముందు ముందు ఎంతోలాభం వుంది వాడివల్ల."

పక పక నవ్వాడు ఆనంద్. ●